కథాపేటిక

# పంజరం

– బి.ఎస్. రాములు

డియర్ ఆనంద్,

నీ రెండు ఉత్తరాలు అందాయి. నీ ముద్దులకొడుకు అనిల్ తొందరగానే దొరికినందుకు నాకు సంతోషం కలిగింది. నేను చిన్నప్పుడు ఏడో తరగతిలో ఇంట్లోంచి పారిపోయినపుడు ఏడాది దాకా ఎవరికీ దొరకలేదు. నీకు తెల్సు ఆ ఏడాదంతా నేను ఎంత కష్టపడ్డానో. ఈ కాలపు పిల్లలకు అలా కష్టపడే స్వభావం తగ్గుతున్నట్టుగా ఉంది. వారం రోజులకే మీ అనిల్ పారిపోయి దొరికాడంటే మీనుండి డిమాండ్లు తీర్చుకోవాలనేతత్వం, పరాధీనత తప్ప స్వయంగా జీవితాన్ని గెలుచుకోగలననే విశ్వాసం లేదని అర్థం.

నేను ఇంట్లోంచి పారిపోయింది మీ అనిల్‌లా అమ్మా నాన్నల ద్వారా నా డిమాండ్లు నెరవేర్చుకోవడం కోసంకాదు. కుటుంబంలోని హింస, దారిద్ర్యం భరించలేక పారిపోయాను. చదువుమీదున్న ఆపేక్షతో చదువు వదిలేసి పారిపోవడం ఒక పేరడాక్సు.

ఇంట్లో అమ్మకు నేను చదువుకోవాలని ఉన్నా, నాన్న సాగనిచ్చిందెక్కడ? అమ్మ పొలం పనులకు కూలికి వెళ్తూ ఇంటి పనంతా నాకే చెప్పేది. సంపాదించింది తాగి తందనాలాడి కూలిపనికి పొమ్మని కొట్టడం తప్ప నాన్న చదువుకొమ్మన్నదెన్నడు? తమ్ముణ్ని, చెల్లెల్నీ ఎత్తుకొని ఆడించడంతోపాటు పేడ తెచ్చి పిడకలు చేయడం, గుట్టకు పోయి కట్టెలు కొట్టుకురావడం మొదలుకొని మొత్తం పనులన్నీ నాకే చెప్పేవాళ్ళు.

ఇప్పుడు అనిల్ పారిపోయింది ఇన్ని కష్టాలు భరించలేకేనంటావా? ఏ ఒక్కరోజైనా అనిల్ మార్కెట్‌కి వెళ్ళి కనీసం కూరగాయలైనా తెచ్చాడా? తన డ్రెస్సులు తాను ఏరోజైనా ఉతుక్కున్నాడా? ఏపూటైనా తిండికి దొరక్క ఆకలితో పడుకున్నాడా? నీ కొడుకు తిండి ఎక్కువై, గారాబం, స్వార్థం ఎక్కువై పారిపోయాడు. ఇంత కఠినంగా అంటున్నందుకు బాధపడకు.

అనిల్ ఒక్కడికోసం నువ్వు పెడ్తున్న ఖర్చుతో ఈదేశంలోని పేద పిల్లలు నలుగురు కడుపునిండా తినవచ్చు. మరోమాటలో చెప్పాలంటే నలుగురు పేదల కడుపులు కొట్టి నీ కొడుక్కు ఇంతగా ఖర్చుపెట్టగలుగుతున్నావు. ఏడవ తరగతి చదివేవాడికి వెయ్యి రూపాయల బూట్లేమిటి? వెయ్యి రూపాయల డ్రెస్సేమిటి? పదకొండో తరగతిదాకా నేను ప్యాంటు తొడిగి ఎరగను. నీకొడుక్కి నాలుగోఏట నుండి ప్యాంట్లేమిటి? రేంజర్ సైకిల్ ఏమిటి? వాడు కోరిన కలర్ టీవీ తేవడం ఏమిటి?

ఆనంద్! పిల్లలు కోరిందల్లా తెచ్చిస్తే నీ ప్రేమ వ్యక్తం చేసినట్లుందనుకుంటున్నావు కదూ! అంటే అనిల్ నిన్ను ప్రేమించడానికి వస్తువుల్ని లంచంగా ఇవ్వదల్చుకున్నావన్నమాట. నీ ఫోన్ బిల్లులో సగం ఉండదురా నా జీతం అని ఓసారి అన్నావు గుర్తుందా! నా కూతురు కరుణ కార్లో ఎన్నడూ స్కూలుకెళ్ళలేదు. సిటీ బస్సులోనే పోతోందని నీకు తెల్సు. కాని నీ కొడుకు అనిల్ ఆటోలో వెళ్తాడు.

అయాచితంగా వస్తే విలువ తెలియదు. అయాచితంగా వచ్చే స్వాతంత్ర్యమూ అంతే. అవి వచ్చినంత తొందరగా పోగొట్టుకోవడమూ సాధ్యమే. రష్యా, తూర్పు యూరపు దేశాల్లో సోషలిజం, స్వాతంత్ర్యం విలువ మ... అర్థంకాకుండా పోవడంవల్లే పోగొట్టుకోవడమూ సులభమైంది.

అయితే మీవాడికి వెయ్యి రూపాయల బూట్లూ, డ్రెస్సూ కొ... మాట. ఇంకో నాల్రోజులు వెతికితే ఇంకో నాలుగువేలు ... దంటావా అని అంటారు. నిజమే. కొనివ్వడమే నయంలే... కంగా సమస్య పరిష్కారం అయిపోయింది. అయితే నా ... కాదు. ఇలా ఎన్ని కోర్కెలని తీర్చుకుంటూ పోతావు. దీనికి ... ఓచోట అంతులేదా! నీ ఆర్థిక స్థాయికి మించినవి కోరినప్పు...



చేస్తావు? ఏం చేస్తావో అదే ఇప్పుడు చేస్తే సమస్య ఇంత జటిలంకాదు.

అక్బరు దర్బారులోకి మహామంత్రి బీర్బల్ ఓరోజు ఆలస్యంగా వచ్చాడట. ఇంతాలస్యమైందేమిటి అని అడిగితే ఏడ్చే మనవడిని సముదాయించలేక ఆలస్యమైందన్నాడట. ఒక పిల్లవాడిని సముదాయించలేనివాడివి ఈ సామ్రాజ్యానికి ప్రధానమంత్రిగా ఏం సముదాయిస్తావని ప్రశ్నిస్తే- సామ్రాజ్యాన్ని సమర్థవంతంగా నిర్వహించవచ్చుగానీ పిల్లల్ని సముదాయించలేం అన్నాడట. దీనిపై వాగ్వాదం జరిగింది. చివరకు అక్బర్ తండ్రిగా, బీర్బల్ పిల్లవాడిగా నటించడానికి అంగీకారమైంది.

''నాన్నా! నాకో కూజా కావాలి'' అన్నాడు బీర్బల్.



క్షణాలమీద కూజా తెప్పించాడు అక్బరు.

నాకో ఏనుగు కావాలన్నాడు బీర్బల్.

అక్బరు ఏనుగునూ తెప్పించాడు.

''ఈ ఏనుగును ఈ కూజాలో పెట్టు'' అంటూ బీర్బల్ అడిగాడు.

''అందులో ఏనుగు పట్టదు'' అని సముదాయించాడు అక్బర్.

''ఆ! ఏనుగును కూజాలో పెట్టునాన్నా'' అంటూ బీర్బల్ చిన్నపిల్లాడిలా ఏడ్వడం ప్రారంభించాడు. ఎంత సముదాయించినా వినలేదు. చెప్పి చెప్పి అక్బరుకు విసుగొచ్చి- చివరకు ఓడిపోయానని చేతులెత్తేశాడు.

పిల్లల కోర్కెలు తీర్చడం, వారిని సముదాయించడం చక్రవర్తులకైనా సాధ్యంకాని పని. ఇక నీబోటి, నాబోటి వారిదెంత! మన ఆర్థిక పరిమితుల్ని పిల్లలకు చెప్పాలి. అర్థం చేసుకోకుండా కోరితే- తీర్చుకుంటూపోతావా? జీవితం పట్ల మనకున్న అవగాహనకు విరుద్ధంగా మనకు స్తోమత ఉన్నంత మాత్రాన కొనివ్వడమేనా? పేద ప్రజల గురించి కథలు రాస్తావు, కవితలు రాస్తావు. ఉపన్యాసాలు దంచుతావు. నీకొడుకు అదేమీ పట్టించుకోకుండా గొంతెమ్మ కోర్కెలు తీర్చమంటే తీర్చుతూపోతే అతనికి నువ్వు అవగాహన పెంచేదెప్పుడు? అన్నీ సమకూర్చుతూ, అతడు స్వార్థపరుడుగా మారడాన్ని ప్రోత్సహిస్తున్నదెవరు? నీలోని తండ్రి కాదా!

ప్రేమ పేరిట, పిల్లల ఇష్టాలు పేరిట, పిల్లల స్వేచ్ఛ పేరిట, వస్తున్న సిద్ధాంతాలన్నీ పాశ్చాత్య దేశాల్లో స్వార్థపరత్వాన్ని పెంచడానికే ఉపయోగపడుతున్నాయి. కుటుంబం ఒక జైలు. కాదనను. ఆ జైలు నుండి పారిపోయిన నాకు అదెంత జైలో మరొకరు చెప్పాల్సిన పనిలేదు. కానీ ఆనంద్, వాళ్ళ అవసరాలు తీర్చేపేరిట నువ్వు చేస్తున్నదేమిటి? - జైలును ప్రేమించేట్టు చేయడం కాదా? జైలును ప్రేమించడం స్వేచ్ఛవుతుందా?

నీ కొడుకు అనిల్- మచ్చికైన జంతువు. పంజరాన్ని ప్రేమించే పక్షి. జైలును ప్రేమించడంవల్లే అతడు ఇతరుల్ని ప్రేమించలేకపోయాడు. బయటి ప్రపంచంలో బతికే ధైర్యాన్నివ్వకుండా, కుటుంబంలోనే అన్నీ సమకూరుతాయనే స్వార్థ దృష్టి కలిగించడం వల్లనే నీ కొడుకు ఏ స్నేహితుడింట్లోనో, ఏ హోటల్‌లోనో పనివాడుగా ఉండలేక తిరిగి దొరికిపోయాడు.

సమ్మర్ హిల్ పుస్తకం చదవమంటావు. ఆ పద్ధతిలో పెంచబడ్డ పిల్లల్లో, పెరిగిన పిల్లల్లో సమాజం కోసం నిస్వార్థంగా పనిచేసేవాళ్ళుగా ఎదిగిన దెందరు అనేది నా ప్రశ్న. ఈ ప్రశ్న వేసుకోకపోతే స్వేచ్ఛ పేరిట స్వార్థపరులుగా మార్చడం తప్పు చేసిందేమిటి?

పిల్లలకు ఆటపాటల్లో ఆనందంగా గడిపే సమ్మర్ స్కూల్సుకు మా కరుణను రెండుసార్లు పంపాను. వాళ్ళక్కడ ఆనందంగా, స్వేచ్ఛగా ఉన్నారు. కాని వారికి పెరిగిన అవగాహన ఏమిటి? తన ఆనందమే ప్రపంచం అనుకోవడంతప్ప. ఆటపాటల సమ్మర్‌స్కూల్‌లో ఎంతో ఆనందంగా గడిపిన కరుణ క్లాసుమేటు 'బదనిక' తన ఈడే వున్న బిచ్చగత్తె కాస్త అన్నం పెట్టమని అడిగితే- పొమ్మంటే పోకపోతే పెంపుడు కుక్కను ఉసిగొల్పింది. భయంతో ఆపాప గావుకేక పెడ్తూ పరిగెత్తింది. పదంగల్లో కుక్క ఆ పాప కాలు కండపీకింది. పొద్దున్నే స్కూలు బస్సుకోసం బయల్దేరిన కరుణ ఆ దృశ్యం చూసింది. ఆరోజు మధ్యాహ్నం అన్నం తినలేదు. ఇంటికొచ్చేసింది. రాత్రికి జ్వరం అందుకుంది. జ్వరంలో కలవరింతలు. ''డాడీ! ఆపాప బతుకుతుందా? డాడీ ఆపాపని ఆసుపత్రికి తీసికెళ్దాం. ఎక్కడుందో వెతకవూ... డాడీ బదనికతో ఇక నేను మాట్లాడను.'' అంటూ కలవరింతలు.

ఆ బిచ్చగత్తె అమ్మాయిని ఎక్కడని వెతకను. మూడురోజులు జ్వరం తగ్గలేదు. ''మీ డాడి గ్రేడీఫెలో... అందుకే నిన్ను కార్లో పంపడు అని బదనిక అంటుంది. మీరు పిసినారా డాడీ'' అని అడిగింది కరుణ. బదనిక ఆనందం ఆమె ఆనందం. దానివల్ల సమాజానికి మేలు లేకపోగా కీడే ఎక్కువ.

అనిల్ క్రిస్మస్ సెలవుల్లో ఇక్కడికి వచ్చినపుడు ఎట్లా ప్రవర్తించాడో నీకు తెల్సు. కరుణను చూస్తే జెలసీ. పోనీ మా చెల్లెల పిల్లల్తో కల్సి ఉన్నాడా? బోలెడు గర్వం. సర్వెంట్ క్వార్టర్స్‌లో ఉన్న మధూలికను ఎంత అసహ్యించుకున్నాడో నీకు తెల్సు. గర్వానికి వయస్సు, హోదా, డబ్బుతో నిమిత్తంలేదు. కలెక్టరు దగ్గరుండే అటెండ

రుకు ఎంతో గర్వం ఉండొచ్చు. కలెక్టరు ఎంతో సౌమ్యుడు కావచ్చు. నీకొడుకు అనిల్ అలిగింది బాధతోనే కావొచ్చు. కానీ ఆ బాధ గర్వం నుండి ఏర్పడిందే తప్ప నిజమైన బాధకాదు.

అనిల్‌ను మార్చే ముందు వాళ్ళ అమ్మ 'ఆమని'ని మార్చు. నీ భార్యలో, పిల్లల్లో అవగాహన పెంచు. తల్లులు గొప్పవారే కావచ్చు. కాని వారు పిల్లలకు స్వార్థాన్ని నేర్పడం వల్లనే పిల్లల వ్యక్తిత్వాలు ఇలా రూపొందుతున్నాయి. ఆమని మీ అన్నయ్య పిల్లల్ని ఎలా చూస్తుందో నీ పిల్లలూ అలానే చూస్తారు. మా అన్నయ్య పేదవాడని నా పిల్లలు వాళ్ళింటికి పోవట్లేదు అని రాశావు. అసలు చుట్టాలు, బంధువుల యింటికి వెళ్ళడంగానీ, వారి పిల్లల్తో కల్సిపోవడం గానీ పూర్తిగా తగ్గిపోయిందని రాశావు. ఆమనియే అందుకు కారణం.

కుటుంబ నియంత్రణవల్ల, వ్యక్తి కుటుంబాలవల్ల ఇంట్లో పిల్లల సంఖ్య తగ్గి- కుటుంబానికి పరిమిత మౌతూ చొరవ కోల్పోతూ బంధువులనే సెంటిమెంట్సు తగ్గుతున్నాయన్న నీ అభిప్రాయం తప్పు. కుటుంబ వ్యవస్థ ఈరోజు స్వార్థానికి కేంద్రం. ఈ తల్లితండ్రీ పిల్లల భవిష్యత్తు అనే పేరుతో వారి స్వార్థానికి కేంద్రంగా కుటుంబాన్ని మార్చారు.

ఉమ్మడి కుటుంబాలు ఉన్నపుడు అనుబంధాలు ఆప్యాయతలుండేవని, ఇపుడవి అంతరించాయని, బాధపడ్డావు. ఆ అనుబంధాలు ఆప్యాయతలు పెంచుకుంటే కలగవా? వారికి ఎక్కడ పెట్టాల్సి వస్తుందనే స్వార్థమే లేకపోతే వ్యక్తి కుటుంబాలు బంధువులు ఉమ్మడి కుటుంబాల్లా ఎందుకు కల్సిపోవడంలేదు.

ఆనంద్, పిల్లలు తమ స్వార్థం కోసం తల్లిదండ్రుల్ని కూడా లెక్కచేయడంలేదని ఉన్న ఈ చిన్నపాటి కుటుంబ వ్యవస్థ కూడా అంతరిస్తే ఎలా అని వాపోయావు. ఈ కుటుంబ వ్యవస్థ ఎంత తొందరగా అంతరిస్తే అంత తొందరగా మనుషులమధ్య, అనురాగం, ఆత్మీయత పెరిగే నవ సమాజం ఆవిర్భవిస్తుంది. అది మునుపటి సోషలిస్టు వ్యవస్థకన్నా ఉన్నతంగా ఉంటుంది.

ఈ కుటుంబం విచ్చిన్నమైతే- పిల్లలు మనుషులందర్నీ ప్రేమించడం ప్రారంభిస్తారు. ఈ కుటుంబ వ్యవస్థ ఉన్నంతకాలం పిల్లలు తన వాళ్ళను, తన స్వార్థాన్ని మాత్రమే ప్రేమిస్తారు. అనిల్‌ను ఆ ప్రయివేటు స్కూలులోంచి తీసేసి గవర్నమెంటు స్కూల్లో చేర్పించు. పేద పిల్లలతోపాటే నీ పిల్లలూ చదువుకోనీ. ఆపని చేయకుండా సమాజం మారాలని పేదల గురించి ఆలోచించాలని అనేదంతా నీ స్వార్థంలో భాగమే. ఆరోజు నువ్వు ఎంతబాధపడ్డావు. కొమురయ్యా! అపుడపుడీ యూనియన్లో ఎందుకు పని చేస్తున్నానా అని బాధపడ్డావు. సరిగ్గా డ్యూటీ చేయమని చెప్తే అన్నా! సారూ, అని పిలిచినవారే వాడేమైనా. మాకు ఆఫీసరా? బాసా? అని పరోక్షంగా తీవ్ర విమర్శ చేశారన్నావు. డ్యూటీ సరిగ్గా చేయమని డిమాండుచేసే అధికారం లేని నీ యూనియన్ పోరాటాలన్నీ స్వార్థాన్ని పెంచడానికే తప్ప- మరెందుకుపయోగపడ్తాయి.

పిల్లలూ అంతే. వాళ్ళ పనులు వాళ్ళు చేసుకోరు. ఇంట్లో పనులకు సహకరించరు. ఎవరికీ ఏ పనీ చేయరు. కానీ తల్లిదండ్రులుగా మనం వాళ్ళ అవసరాలన్నీ తీర్చమంటారు. ఇది స్వార్థపరుల సమస్యే తప్ప- పిల్లల సమస్యకాదు.

నన్ను పిసినారి అనుకున్నా నేను బాధపడేదేమీ లేదు. నువ్వడిగిన డబ్బు మాత్రం ఇవ్వలేను. ఆమనికి ఆ పనికిమాలిన టెస్టులన్నీ చేయించి లేనిరోగాలున్నట్టు బాధపడి కొత్త రోగాలు తెచ్చుకుని అప్పులపాలయ్యే బదులు, అల్లోపతి వైద్యం వదిలేసి హోమియోపతీయో, ప్రకృతి చికిత్సో ఆశ్రయించు.

అప్పుచేయకు. నీ యింట్లో ఉన్న ఫ్రిజ్జు అమ్మేయి. ఆ బంగారం అమ్మెయ్యి. నీ స్కూటరు అమ్మెయ్యి. మొన్న కొన్నావే ఆ ప్లాటు అమ్మెయ్యి. అప్పులు తీర్చుకో. ఇవన్నీ ఉండగా నన్ను డబ్బడగడం నీ స్వార్థాన్ని కాక మరిదేన్ని తెలుపుతుంది?

ఒరే ఆనంద్, నేను పేదగా ఉన్నపుడు నీ సుఖాల్లో ఆనందాల్లో పాలుపంచుకోవడానికి పిలువలేదు. నా కష్టాల్లో నీవేనాడూ ఆదుకోలేదు. ఇక మన మధ్య ఉన్నది ఏమిత్రా? అవకాశవాదం తప్ప. దానికే క్లాసు మేటనీ, ఒకవీధివాడనీ, ప్రేమనీ పేర్లు పెట్టినంత మాత్రాన నమ్మేంత పిచ్చివాడినైతే ఈ స్థాయికి ఎదిగి ఉండేవాడినేకాదు.

నీ యిల్లు, ప్లాటు, ఫర్నీచర్, ఉద్యోగం అన్నీ కోల్పోయి రోడ్డున పడ్తే అప్పుడు నా చిన్ననాటికి నువ్వు చేరావనుకుంటూ నీలా ఊరికే కూర్చోను. నీ అంతటి స్వార్థపరుణ్ని కాను. వీలుకాదనడానికి. నువ్వు అన్నీ కోల్పోయినపుడు నిన్ను ఆదుకుంటాను. ఎలాగో తెల్సా! ఊరికే డబ్బిచ్చి కాదు. నీకు ఓ ఉద్యోగం ఇప్పిస్తాను.

ఒరే ఆనంద్! నీ సొంత తమ్ముడు నిరుద్యోగిగా ఉండగానే వేరుపడ్డావు. సాయం చేయాల్సి వస్తుందని. నీ చెల్లెలు కోమల పెళ్ళి కుదరకముందే వేరుపడ్డావు. కల్సి వుంటే ఎక్కువ కట్నం ఇచ్చి పెద్ద సంబంధం చేయాల్సి వస్తుందని. అవసాన దశలో ఉన్న మీ అమ్మను అన్నిటికి అందుబాటులో ఉన్న నీ దగ్గర ఉంచుకోకుండా ఆమని మాటపై- బీడీలు చేసుకొని బతికే నీ చెల్లెలింటికి పంపావు. నాలుగు రాళ్ళు కోమలి మొహాన కొట్టి నేను పంపలేదా అన్నావు. నీ దగ్గరుంటే మీ అమ్మ ఇంకో ఇరవైఏళ్ళు బతికేదిరా!

నువ్వు ఇవాళ ఒక సాంఘిక గౌరవం, హోదా పెరిగాక మానవతా విలువలు, ఆప్యాయతలు గూర్చి మాట్లాడుతున్నావా? నీ ఎదుగుదలే వీటిని ధ్వంసం చేయడం నుండి ఎదిగింది. నువు చెప్పే విలువలు, ఆప్యాయతలు నీలో.. ఇపుడైనా ఉన్నాయా! నీ చెల్లెలు గర్భసంచి ఆపరేషన్ కోసం అన్నయ్యా అని ఏడుస్తూ వస్తే ఏం సాయం చేశావు. తాగుబోతు భర్త మరోదాన్తో ఉంటే ఏం చేశావు. అదిప్పుడు క్యాన్సర్‌గా మారింది. ఆ పాపం ఎవరిదిరా!?

పిల్లల్లో ఆప్యాయతలు అడుగంటాయని ఏడుపెందుకురా- నీలో, ఆమనిలో అవి వుంటేకదా నేర్చుకోవడానికి. నీమూలభాష స్వార్థంరా. ఆ స్వార్థంవల్లే పంజరంలో బందీవైనావు. ఆ స్వార్థ బంధిఖానా నుంచి బయటికి వచ్చి, సవ్యంగా ఆలోచిస్తే స్వేచ్ఛ, నిస్వార్థం నీకు అర్థమవుతాయి.

ఇట్లు నీ మాజీ క్లాసుమేటు

కొమురయ్య

★

## కడుపులో గడియారాలు

చైనాలో వుంటున్న బంగ్‌షెన్‌షేన్, నిజాల్ని కక్కించడంలో పోలీసు వెంకటస్వాములు ఎంతటి గొప్పవారో మనుషుల పొట్టల్లో వున్న రకరకాల వస్తువుల్ని బయటకు తియ్యడంలో అంత గొప్పవాడు. అతను ఇప్పటికి 42, 195 పొట్టలను పరీక్షించి వాటిల్లోంచి గడియారాలను, స్టిక్స్, చిన్న స్పూన్లను, ఇంకా అనేక వస్తువులను 18సంవత్సరాల నుంచీ తీస్తూనే వున్నాడు. ఇందుకొరకు ఆ డ్యాక్టరుగారు గ్యాస్ట్రోస్కోప్‌ను వినియోగిస్తారు. ఆ వస్తువులను మింగినవారికి, తిండితో పొట్టనిండక, వాటిని కూడా గుటకాయిస్వాహా చేస్తున్నారన్నమాట!

## ఉల్లి ఐస్‌క్రీమ్

మనందరమూ సువాసనలు వేసే ఐస్‌క్రీములను తింటూ వుంటాము. అయితే మీకు కొత్త వాసనతో ఐస్‌క్రీములు కావాలంటే ప్రస్తుతం ఉల్లిపాయ వాసన, చేపల వాసనలు వేసేవి సిద్ధంగా వున్నాయి. వెనిజులాలోని మెండాకు మీరు వెళ్లారంటే చాలు- అక్కడ ఓ అతి పెద్ద ఐస్‌క్రీమ్ పార్లర్ స్వాగతం చెప్తుంది. అచ్చట ఏకంగా ఏడువందల సువాసనలతో రకరకాల ఐస్‌క్రీమ్‌లు మిమ్మల్ని ఉక్కిరి బిక్కిరి చేస్తాయి. ఉల్లి, వెల్లుల్లి, మాంసం, చేపలు వంటి వాసనలు నిండిన మంచు మీగడలు తిని మీరు మంత్రముగ్ధులవుతారు సుమా! అయితే ఏ ఐస్‌క్రీమ్ అక్కడ కృత్రిమమైన సువాసనలతో తయారుచెయ్యబడదు. వెల్లుల్లి ఐస్‌క్రీమ్‌కు మీరు ఆర్డరిస్తే, అది వెల్లుల్లితోనే తయారుచేసి మీకు అందిస్తారక్కడ. అక్కడ అల్లం ఐస్‌క్రీమ్‌కు గిరాకీ ఎక్కువగా వుంది. అచ్చట వున్న అన్ని ఐస్‌క్రీమ్‌లూ తినాలంటే నాల్గైదు నెలలు అక్కడ వుండవలసి వస్తుందో ఏమో!

-కొడిమెల